నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 27 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

జిట్టా బాలకృష్ణారెడ్డి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్, మాజీ ఎమ్మెల్యేలు కిశోర్, భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి

జిట్టాకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 26 : అనారోగ్యం కారణంగా కొన్ని రోజుల నుంచి హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులతో కలిసి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డికి అందిస్తున్న వైద్యం వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. జిట్టా బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని, జిట్టా త్వరలో కోలుకుంటారని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నోముల పరమేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

జిల్లాలో రెండు రోజులు గవర్నర్ పర్యటన

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 26 : జిల్లాలో ఈ నెల 27, 29 తేదీల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన ఉన్నట్లు కలెక్టర్ హనుమంతు కె.జెండగే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గవర్నర్ మంగళవారం ఉదయం 8 గంటలకు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుంటారని, అనంతరం ములుగు, వరంగల్, జనగాం జిల్లాల పర్యటనకు వెళ్తారని పేర్కొన్నారు. తిరిగి ఈ నెల 29న మధ్యాహ్నం 2.20 గంటలకు ఆలేరు మండలంలోని కొలనుపాకలో గల జైన దేవాలయాన్ని, సోమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారని తెలిపారు. అదేరోజు సాయంత్రం 3.30 గంటలకు భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శిస్తారని చెప్పారు. సాయంత్రం 4.15 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులను కలుస్తారని, 5.15 గంటలకు కలెక్టరేట్‌లో రచయితలు, కళాకారులు, ప్రముఖులు, రాష్ట్ర జాతీయ అవార్డు గ్రహీతలను కలుస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

యాదగిరిగుట్టలో ఏర్పాట్లు పూర్తి

- బ్రేక్ దర్శనం.. ఉచిత దర్శన వేళల్లో మార్పులు

యాదగిరిగుట్ట : రాష్ట్ర గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా యాదగిరిగుట్టకు వస్తున్న నేపథ్యంలో ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపైన వీవీఐపీ అతిథి గృహంలో ప్రత్యేక విడిదిని ఏర్పాటు చేశారు. గవర్నర్‌తోపాటు 200 మంది రాష్ట్ర, జిల్లా అధికారులు రానున్నారు. షెడ్యూల్డ్ ప్రకారం యాదగిరిగుట్ట దేవస్థానంలో గవర్నర్ దంపతులు 45 నిమిషాలు గడుపనున్నారు. ఉదయం 8 గంటలకు కొండపైన వీవీఐపీ అతిథి గృహం వద్దకు చేరుకోనున్నారు. అక్కడే గవర్నర్‌కు అధికారులు ఘన స్వాగతం పలుకనున్నారు. అనంతరం లిఫ్టు మార్గం గుండా మాఢవీధుల్లోకి చేరుకుని విష్ణు పుష్కరిణి, అఖండ దీపారాధనలను పరిశీలించనున్నారు. అక్కడి నుంచి వీలును బట్టి తూర్పు లేదా ఉత్తర రాజగోపురం గుండా ఆలయంలోకి వెళ్తారు. స్వయంభూ పంచ నారసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముఖ మండపంలో గవర్నర్ దంపతులకు ప్రధానార్చక బృందం చతుర్వేద ఆశీర్వచనం చేయనున్నారు. దర్శనానంతరం లిఫ్టు మార్గం గుండా వీవీఐపీ అతిథి గృహానికి వచ్చి అల్పాహారం స్వీకరించి తిరుగు ప్రయాణం కానున్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఉదయం 9 గంటలకు నిర్వహించే బ్రేక్ దర్శనంతోపాటు స్థానికుల ఉచిత దర్శనాల సమయాలను మార్పు చేస్తున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు. 9.30 నుంచి 10 గంటల వరకు స్థానికులకు ఉచిత దర్శనం, 10 నుంచి 10.30 గంటల వరకు బ్రేక్ దర్శనం ఉంటుందని వివరించారు.

ఆధ్యాత్మికం ఉట్టిపడేలా ప్రత్యేక డోనర్ సెల్

కొండపైన రథశాల పక్కన నిర్మించిన డోనర్ సెల్

యాదగిరిగుట్ట, ఆగస్టు 26 : యాదగిరిగుట్ట కొండపైన డోనర్ సెల్‌ను ఆలయ అధికారులు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రత్యేకంగా నిర్మించారు. మాఢవీధుల్లోకి లిఫ్టు, రథశాల మధ్యలో సుమారుగా 300 ఎస్ఎఫ్‌టీలో దాతలు అందజేసే సహాయాన్ని స్వీకరించేందుకు ప్రత్యేక హాల్ నిర్మించారు. గతంలో పశ్చిమ రాజగోపురం పక్కనే అష్టభుజి ప్రాకార మండపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయగా దాతలకు కనిపించకుండా ఉండటంతో పాటు సరిపడా స్థలం లేకుండా ఉంది. ఈ పరిస్థితిని గమనించిన దేవస్థాన అధికారులు మాఢవీధుల్లో భక్తులకు కనిపించే విధంగా విశాలమైన హాల్‌ను నిర్మించగా అందుబాటులోకి రానుంది. పై భాగంలో స్వామివారి ప్రతిమతోపాటు ఇరువైపులా ద్వారపాలకుడు, గరుత్మంతుడి ప్రతిమలను, కింది భాగంలో ఐరావతాలు, దర్వాజలకు పద్మాలు, ఇరువైపులా యాళీ ఫిల్లర్లను అమర్చి అద్భుతంగా తీర్చిదిద్దారు.

పోచంపల్లిలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

గోకుల కృష్ణ.. గోపాల కృష్ణ

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆలయాలు, గ్రామ కూడలిలో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని సంబురంగా నిర్వహించారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించగా చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు.

విష జ్వరాల విజృంభణ

భువనగిరిలో ఏరియా ఆసుపత్రిలో టెస్టుల కోసం రోగుల క్యూ

అధ్వానంగా పారిశుధ్యం.. పట్టించుకోని ప్రభుత్వం

వైరల్ ఫీవర్ బాధితులతో కిటకిటలాడుతున్న దవాఖానలు

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సౌకర్యాలు కరువు

మందుల కొరత.. రోగ నిర్ధారణ పరీక్షలకు వెతలు

హాస్పిటల్ నిర్వహణ అంతంతే.. తీవ్ర అవస్థలు పడుతున్న రోగులు

జిల్లాలో 3,257 మందికి ఫీవర్.. 81మందికి డెంగ్యూ

జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. పారిశుధ్యం అధ్వానంగా మారడం, ప్రభుత్వం పట్టించుకోపోవడంతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. వైరల్ ఫీవర్ వచ్చిన జనంతో దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో సౌకర్యాలు కరువయ్యాయి. మండలాలు, పట్టణాలు, గ్రామాల్లోని సర్కారు దవాఖానల్లో సరైన వైద్య సదుపాయం లేక జనం ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లాల్సి వస్తున్నది.

– యాదాద్రి భువనగిరి, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా టైఫాయిడ్, డెంగ్యూ కేసులు ఎక్కువ నమోదు అవుతున్నాయి. జిల్లాలో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్ ఏరియా ఆస్పత్రులు, 21 పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు ఉన్నాయి. అన్ని చోటక్లా జ్వర పీడితులు క్యూ కడుతున్నారు. ఉదయం నుంచే తరలివస్తున్నారు. జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాల సమస్యలతో బారులు దీరుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,257 మందికి జ్వరాలు వచ్చాయి. అత్యధికంగా తుర్కపల్లి మండలంలో 429 మంది ఉన్నారు. 81మందికి డెంగ్యూ వ్యాధి నిర్ధారణ అయ్యింది.

భువనగిరిలో ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలు

జిల్లా ఆస్పత్రిలో సదుపాయాల్లేవ్

భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనూ కనీస సదుపాయాలు కరువయ్యాయి. రోజూ 400 నుంచి 500 పైగా ఓపీ నమోదవుతున్నది. రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఆస్పత్రిలోని ల్యాబ్ వద్ద నమూనాలు తీసుకోవడానికే గంటల సమయం పడుతున్నది. పదుల సంఖ్యలో స్వయంగా రోగులే క్యూ కట్టాల్సిన పరిస్థితి. ఇప్పటికే రోగాలతో బాధపడుతున్న వారు రెండు, నుంచి మూడు గంటల లైన్‌లో నిలబడాల్సి వస్తున్నది. మందుల కొరత వేధిస్తున్నది. డాక్టర్లు కూడా ఎక్కువ సమయం కేటాయించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మందులు కొన్ని రకాలు మాత్రమే అందుబాటులో ఉండగా, వైద్యులు రాసిన చీటీల్లో సగం బయట కొనుగోలు చేయాల్సి వస్తున్నది. అజిత్రోమైసిన్, యాంటీబయాటిక్‌లు, సిరప్‌లు అందుబాటులో ఉండడం లేదు. దాదాపు అన్ని పీహెచ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచే సరఫరా లేదని చెప్తుండడం గమనార్హం. ఇక జిల్లా కేంద్రాస్పత్రి నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. ఆవరణలో అక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. వార్డుల్లో ఈగలు, దోమలు కనిపిస్తున్నాయి. నోటీస్ బోర్డులపై ఎప్పటికప్పుడు రోగుల వివరాలు పొందుపరచడంలేదు.

ఫాగింగ్ మరిచారు

పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది. పల్లెలను పట్టించుకునే వారే లేరు. స్థానిక ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. దాంతో పల్లెల్లో పారిశుధ్యంపై పర్యవేక్షణ కొరవడింది. ఎక్కడ చూసినా రోడ్లపైనే మురుగు ప్రవహిస్తున్నది. చెత్తాచెదారం పేరుకుపోతున్నది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దోమలు, ఈగలు రోగాల వ్యాప్తికి కారణమవుతున్నాయి. పందులు, కుక్కలు విపరీతంగా సంచరిస్తున్నాయి. దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ చేయడమే మరిచిపోయారు.

సర్కారు దవాఖాన అంటేనే భయమైతున్నది

జ్వరం, కాళ్ల నొప్పులతో ఉదయం 9 గంటలకు ఆస్పత్రికి వచ్చాను. పరీక్షలు చేయించుకోవాలని డాక్టరు చీటీ రాశారు. శాంపిల్స్ ఇవ్వడానికే మూడు గంటలు పట్టింది. జ్వరం, కాళ్ల నొప్పులతో ఆరోగ్యం బాగా లేకున్నా గంటల తరబడి నిలబడ్డాను. నిలబడే ఓపిక లేక చాలా ఇబ్బంది అయ్యింది. ప్రభుత్వ ఆస్పత్రికి రావాలంటేనే భయమైతున్నది. ప్రైవేట్‌కు పోతే వేలకు వేలు గుంజుతున్నరు.

- కంసాని భాస్కర్, బొల్లేపల్లి, భువనగిరి మండలం

బొల్లేపల్లి పీహెచ్‌సీలో మందుల కొరత

భువనగిరి కలెక్టరేట్ : బొల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. బొల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద 10 సబ్‌సెంటర్లు ఉండగా అందులో రాయగిరి, అనంతారం, అనాజీపూర్, నందనం, ముత్తిరెడ్డిగూడెం, చందుపట్ల, బస్వాపూర్, వీరవెల్లి, వడపర్తి, బొల్లేపల్లి ఉన్నాయి. నందనం, వీరవెల్లి సబ్ సెంటర్లలో ఏఎన్ఎంల పోస్టులు ఖాళీగా ఉండగా మందుల కొరత సైతం వేధిస్తున్నది.

బొల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మందులు లేవంటున్నారు

పీహెచ్‌సీ దవాఖానకు పొద్దుగాలనే వచ్చిన. నాకు కాళ్ల నొప్పులతో పాటు అనారోగ్యంగా ఉన్నది. ఆసుపత్రిలో మందులు లేవంటున్నారు. సూదిమందు సైతం లేదు. తండా నుంచి వచ్చి మరిపోవుడైతున్నది. డాక్టర్ కూడా లేడు. సర్కారు దవాఖానలో మందులు, డాక్టర్లు లేకపోతే రోగుల పరిస్థితి ఎలా ఉంటుంది.

- ధరావత్ బాషా, మీటితండా, భువనగిరి మండలం

ఇండెంట్ పెట్టాం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత కొంత మేర ఉంది. దీని కోసం ఇండెంట్ సైతం పెట్టాం. త్వలరో మందులు వస్తాయి. ప్రతి సబ్‌సెంటర్‌లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు 60నుంచి 100మందికి పైగా ఓపీ నమోదవుతాయి. 20 నుంచి 25వరకు వైద్య పరీక్షలు చేపడుతాం.

-డాక్టర్ యామినీశృతి, వైద్యాధికారిణి, బొల్లేపల్లి పీహెచ్‌సీ

ఆధ్వానంగా ఉన్న వార్డు పరిసరాలు

భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలో చెత్తా చెదారం

కాంగ్రెస్‌లో 'నామినేటెడ్' చిచ్చు

నల్లగొండ జిల్లాలో నామినేటెడ్ పదవులన్నీ రేవంత్ వర్గానికే..

- ఇప్పటికే బండ్రు శోభారాణి, పటేల్ రమేశ్‌రెడ్డి, పాల్వాయి రజినికుమారి
- తాజాగా గుత్తా అమిత్‌రెడ్డికి డెయిరీ కార్పొరేషన్ చైర్మన్
- పార్టీ అధిష్టానం వద్ద జిల్లా సీనియర్ల తీవ్ర అభ్యంతరం
- అలా వచ్చినోళ్లకు ఇలా పదవులా అంటూ గుస్సా
- సోషల్ మీడియాలోనూ కాంగ్రెస్ శ్రేణుల రచ్చ రచ్చ
- పెండింగ్‌లో అమిత్‌రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ పోస్టు?
- రసకందాయంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ



నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ కాంగ్రెస్‌లో నల్లగొండ సీనియర్ లీడర్లదే హవా! .. ఇది ఒకప్పటి మాట. నేడు అలాంటి సీనియర్లు సొంత జిల్లా నల్లగొండలోనే డమ్మీ అయ్యారా? అంటే అవుననే సమాధానం ఆ పార్టీ శ్రేణుల నుంచే వినిపిస్తున్నది. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా సీనియర్లకు చెక్ పెడుతూ నల్లగొండ జిల్లాపై పట్టు బిగిస్తున్నారనడానికి నామినేటెడ్ పోస్టుల భర్తీనే ఉదాహరణగా చూపుతున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా పరిధి నుంచి ఐదు నామినేటెడ్ పోస్టులకు ఎంపిక చేసిన వారిలో నలుగురు రేవంత్‌రెడ్డి వర్గీయులే అవడం గమనార్హం. వారంతా రేవంత్‌రెడ్డితోపాటు లేదా ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి వచ్చిన వారే. దాంతో అలా వచ్చిన వారికి ఇలా పదవులు ఇచ్చుడేంది అన్న రంది అసలైన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల్లో నెలకొంది. సోషల్ మీడియా వేదికగా పార్టీ అధిష్టానాన్ని టార్గెట్ చేస్తూ తమ ఆగ్రహాన్ని, ఆవేదనను కూడా బాహాటంగానే వెళ్లగక్కుతున్నారు. ఆది నుంచీ పార్టీ కోసం కష్టపడుతూ నామినేటెడ్ పోస్టుల రేస్‌లో ఉన్న కొందరు ముఖ్యులు జిల్లా సీనియర్ నేతలను ఇదే విషయం మీద నిలదీసినట్లు తెలిసింది. తప్పని సరి పరిస్థితుల్లో జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత నేరుగా పార్టీ హైకమాండ్ దృష్టికి వీళ్ల అభ్యంతరాలను తీసుకెళ్లినట్లు సమాచారం. దాంతో ఇటీవల ప్రకటించిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి పోస్టులను తాత్కాలికంగా పెండింగ్‌లో పెట్టినట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన తొలినాళ్లతోపాటు పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ప్రారంభ రోజుల్లోనూ నల్లగొండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలే ఆయనకు కొరకరాని కొయ్యగా మారిన విషయం తెలిసిందే. అలాంటి సీనియర్ నేతలకు వ్యూహాత్మకంగా ఇప్పుడు రేవంత్ వరుస షాక్‌లు ఇస్తుండడం జిల్లా కాంగ్రెస్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఎంపీ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి ఎంపీ అభ్యర్థుల ఎంపికలోనూ రేవంత్‌రెడ్డిదే కీలక పాత్ర. ఆ తర్వాత నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ జిల్లా సీనియర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోలేదన్న చర్చ జరుగుతున్నది. ఇప్పటివరకు జిల్లాకు చెందిన ఐదుగురికి నామినేటెడ్ పోస్టులు దక్కగా అందులో నలుగురు రేవంత్‌రెడ్డికి వర్గానికి చెందినవారే అవడం గమనార్హం. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డితోపాటు రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలిగా పాల్వాయి రజినికుమారి, రేవంత్‌రెడ్డితో పాటు టీడీపీలో పనిచేస్తూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ రేవంత్‌రెడ్డి కోటాలోనే నామినేటెడ్ పదవులు దక్కాయని ఆ పార్టీ వర్గాలే చెప్పుకున్నాయి.

తాజాగా ఈ నెల 20న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డికి రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ పదవి లభించింది. అయితే శాసన మండలిలో సంఖ్యా బలం రీత్యా చైర్మన్ సుఖేందర్‌రెడ్డితో ఉన్న రాజకీయ అవసరాలతో పాటు రేవంత్‌రెడ్డికి గుత్తా ఫ్యామిలీతో ఉన్న బంధుత్వం కూడా అమిత్‌రెడ్డికి చైర్మన్ పదవి దక్కడంలో కీలక అంశాలుగా తెరపైకి వచ్చాయి. ఇవన్నీ ఎలా ఉన్నా అమిత్‌రెడ్డికి పదవి కట్టబెట్టడం అనేది గత నామినేటెడ్ పోస్టుల మాదిరిగానే రేవంత్‌రెడ్డి స్వతహాగా తీసుకున్న నిర్ణయమన్నది ఆ పార్టీ సీనియర్ల ఆరోపణ. దాంతో ఇవన్నీ జిల్లా మంత్రులు, ఇతర సీనియర్లకు మింగుడు పడని అంశాలుగా మారాయి. ఇదే సమయంలో నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్న ఇతర ముఖ్య నేతలు తమ అభ్యంతరాలను వ్యక్తం చూస్తూ జిల్లా మంత్రులకు మొర పెట్టుకున్నట్లు తెలిసింది. ఒకప్పుడు రాష్ట్ర కాంగ్రెస్‌కు దశ దిశలను నిర్దేశించిన జిల్లా సీనియర్లకు పోస్టుల భర్తీ వ్యవహారం అవమానంగానే మారిందన్న టాక్ ఆ పార్టీ వర్గాల్లో జోరుగా నడుస్తున్నది.

ఆశావాహుల గుస్సా...

మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీని అంటి పెట్టుకుని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడ్డ పలువురు ముఖ్య నేతలు ఎప్పటి నుంచే నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. వారి ఎదురుచూపులకు మాత్రం ఫలించలేదు. ఎమ్మెల్యేలుగా గెలిచి మంత్రులైన కీలక నేతలు, ఎంపీలు ఇప్పుడు తమను పట్టించుకోవడం లేదని నిజమైన కాంగ్రెస్ నేతలు గుస్సా వ్యక్తం చేస్తున్నారు. జిల్లా మంత్రులు, కీలక నేతల వద్ద ఆశావాహులైన పలువురు నేతలు తమ కష్టానికి విలువు లేదా? పార్టీని నమ్ముకుంటే ఇంతేనా? మీరు అందలం ఎక్కితే సరిపోతుందా? మా పరిస్థితి ఇంతేనా? అన్న ప్రశ్నలు సంధిస్తున్నట్లు తెలిసింది. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పార్టీ నేతలు అద్దంకి దయాకర్, పున్న కైలాస్ నేత, గుమ్ముల మోహన్‌రెడ్డి, ఇంకా పలువురు నేతలు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టులను ఆశిస్తూ వస్తున్నారు. ఇలాంటి వారంతా ప్రస్తుతం సీనియర్ల వద్ద తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దాంతో ఇటీవల జిల్లాకు చెందిన సీనియర్ నేత ఒకరు నేరుగా ఢిల్లీలో పార్టీ హైకమాండ్ వద్దే తన గళం విప్పినట్లు తెలిసింది. పార్టీ నమ్ముకున్న నేతలకు న్యాయం చేయకపోతే క్యాడర్‌లో విశ్వాసం కోల్పోతామని హెచ్చరించినట్లు సమాచారం. వారితోపాటు రాష్ట్రంలోని పలువురు ముఖ్యులు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. దాంతో తాత్కాలికంగా పోచారం శ్రీనివాసరెడ్డికి క్యాబినేట్ హోదాతో ఇచ్చిన వ్యవసాయ సలహాదారు పదవిని, గుత్తా అమిత్‌రెడ్డికి ఇచ్చిన డెయిరీ సహకార సమాఖ్య చైర్మన్ పదవిని పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం.

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 26 : భువనగిరి జిల్లా కేంద్రంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో రాజా నరసింహారావు మెమోరియల్ ఐటీఎఫ్ వరల్డ్ జూనియర్స్ అండర్-18 టెన్నిస్ పోటీలు సోమవారం హోరాహోరీగా కొనసాగాయి. ఉదయం బాల బాలికల విభాగాల్లో సింగిల్స్ క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు జరుగగా, మధ్యాహ్నం తర్వాత మెయిన్ డ్రాస్ ఫస్ట్ రౌండ్ కొనసాగింది. మంగళవారం మెయిన్ డ్రాస్ ఫస్ట్ రౌండ్ పూర్తయ్యాక, సెకండ్ రౌండ్ ప్రారంభం కానుంది. వచ్చే నెల ఒకటో తేదీ వరకు ఈ పోటీలు జరుగనున్నాయి.

పోటీలో తలపడుతున్న క్రీడాకారుడు